క్లుప్తంగా

కంటి సమస్యలపై అప్రమత్తం

• డాక్టర్ రవళి



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ రవళి

విజయనగరం ఫోర్ట్: కంటి సమస్యల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్వామి కంటి ఆస్పత్రి వైద్యురాలు రవళి అన్నారు. పట్టణంలోని పూల్‌బాగ్‌లో ఉన్న సరస్వతి శిశు మందిర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శరీరంలోని అన్ని అవయవాలలో నేత్రం ప్రధానమైనదన్నారు. కళ్లు కనిపించకపోతే జీవితం అంధకారం అవుతుందని చెప్పారు. సుగర్ వ్యాధిగ్రస్తులకు రెటీనా దెబ్బతినే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎ. గోపాలరావు, పీఆర్‌టీ బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అల్లూరి సత్య నారాయణ రాజు

నెల్లిమర్ల: మిమ్స్ రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. మిమ్స్ ఆవరణలో బోధనేతర సిబ్బంది వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ అల్లూరి సత్యనారాయణ రాజు (బాబీ) క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నూతన సంవత్సరంలో అన్ని వర్గాల ప్రజలు జరిగి సుఖ, సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

కిటకిటలాడుతున్న చేపల మార్కెట్



రింగురోడ్డులో చేపల మార్కెట్ వద్ద కొనుగోలుదారుల రద్దీ

విజయనగరం/విజయనగరం టౌన్: కార్తీక మాసం ముగియడంతో పట్టణంలోని చేపలు, మాంసం మార్కెట్లు వినియోగదారులతో కళకళలాడుతున్నాయి. స్థానిక రింగురోడ్డులో ఏర్పాటు చేసిన చేపల దుకాణాల వద్ద ఆదివారం వందల సంఖ్యలో ప్రజలు కనిపించారు. అలాగే చికెన్ షాపుల్లో కూడా రద్దీ కనిపించింది. ధరలు పెరిగినా ప్రజలు పోటీ పడి మరీ కొనుగోలు చేస్తున్నారు. కిలో చికెన్ ధర రూ.150, మటన్ 800 రూపాయలు పలుకుతోంది. అలాగే చేపల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. వంజరం చేప కిలో రూ.600, కోనాం రూ.800, సందువాలు రూ.500, మార్పులు రూ.400, రాగిన్నె రూ.250, రెయ్యిలు రూ.250 నుంచి 300 రూపాయల వరకు పలుకుతున్నాయి.

భగవద్గీత పఠన పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు

బొబ్బిలి: గీతా జయంతి సందర్భంగాక హిందూ ఉత్సవ సమితి సభ్యులు ఆదివారం పూల్‌భాగ్‌లోని డోలా మండపంలో విద్యార్థులకు భగవద్గీత పఠన పోటీలు నిర్వహించారు. గీతలోని 15వ అధ్యాయమైన పురుషోత్తమ ప్రాప్తి యోగంలోని శ్లోకాలపై సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు ఉత్సవ సమితి అధ్యక్షుడు పెంట స్వామినాయుడు, గీతా మండపం అధ్యక్షుడు అల్లు స్వామినాయుడు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా రాము, కొల్లూరు జగన్నాథం, ముట్నూరు వేణుగోపాల్ వ్యవహరించారు. గణితోపాధ్యాయులు చింతల పైడిరాజు, పాపారావు, చెలికాని కేశవ, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విద్యార్థులకు ఎంతో మేలు

తెర్లాం: విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని స్థానిక శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పుస్తకాలు చదివించడం , కథలు చదవడం, చెప్పించడం చేయించారు. అనంతరం లైబ్రేరియన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి పుస్తక పఠనంపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల్లో చదువంటే మాకిష్టం అనే కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. విద్యార్థులంతా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే..

ఆడుదాం ఆంధ్రా..



కబడ్డీ ఆడుతున్న బాలికలు (ఫైల్)

• రేపటి నుంచి సచివాలయ స్థాయిలో క్రీడా పోటీలు
• ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

పూసపాటిరేగ: గ్రామీణ ప్రాంతాలలో సత్తా ఉన్న క్రీడాకారులను గుర్తించి జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆదరణ కరువై, ఎంతోమంది క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునే అవకాశాలను కోల్పోతున్నారు. ప్రోత్సాహం లేని క్రీడాకారులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 26 నుంచి సచివాలయం స్థాయిలో వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనుంది. పోటీలకు సంబంధించిన క్రీడా సామగ్రిని ఇప్పటికే సచివాలయ స్థాయిలో పంపిణీ చేశారు. జిల్లాలో 626 సచివాలయాల పరిధిలో 88,133 మంది పురుషులు, 47,010 మంది మహిళలు కలిపి మొత్తం 1,35,143 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. 15 సంవత్సరాలు పైబడి క్రీడల పట్ల ఉత్సాహవంతులైన స్త్రీ, పురుషులు క్రీడలలో పాల్గొన్నున్నారు. నాకౌట్ పద్ధతిలో జరగనున్న ఈ పోటీలు స్త్రీ, పురుషులకు వేర్వేరుగా నిర్వహించనున్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విభాగాల్లో పోటీలుంటాయని అధికారులు చెబుతున్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలలో నియోజకవర్గ స్థాయిలో తొలిస్థానంలో నిలిచిన జట్టుకు రూ. 35 వేలు, జిల్లా స్థాయిలో రూ. 60 వేలు, రాష్ట్ర స్థాయిలో 5 లక్షల రూపాయల ప్రైజ్ మనీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. బ్యాడ్మింటన్ విభాగంలో నియోజకవర్గ స్థాయి విజేతకు రూ. 20 వేలు, జిల్లా స్థాయిలో రూ.35 వేలు, రాష్ట్రస్థాయిలో 2 లక్షల రూపాయలను ప్రైజ్ మనీ ఇవ్వనున్నారు. బ్యాడ్మింటన్‌లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి కూడా నగదు పురస్కారాలు అందించనున్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో..

సచివాలయం స్థాయిలో ఆడుదాం ఆంధ్రా క్రీడలను వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. నియమ, నిబంధనల మేరకు పీఈటీలు, పీడీలు క్రీడలను పర్యవేక్షిస్తారు. ఇప్పటికే పలుమార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం.

– సత్యనారాయణ, పీఈటీ, అంబేద్కర్ గురుకులం, కొప్పెర్ల.

అవగాహన కల్పించాం



ఆడుదాం ఆంధ్రా క్రీడలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అవగాహన కల్పించాం. ప్రతి గ్రామం నుంచి పోటీల్లో పాల్గొనే స్త్రీ, పురుషులను ఎంపిక చేశారు. ఈ నెల 26 నుంచి సచివాలయం స్థాయిలో ఘనంగా క్రీడలు నిర్వహించడానికి సన్నద్ధమయ్యాం.

– ఎం. రాధిక , ఎంపీడీఓ పూసపాటిరేగ

సేవే క్రీస్తుమార్గం..



పూసపాటిరేగ : బూడివీధిలో క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన చర్చి



విజయనగరం ఆర్‌సీఎం చర్చిలో విద్యుత్ కాంతులతో ఏసు జననం సెట్



విజయనగరంలో ముస్తాబైన కంటోన్మెంట్ బాప్టిస్ట్ చర్చి

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లోని చర్చిలు అందంగా ముస్తాబయ్యాయి. విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్నాయి. సేవే క్రీస్తు తత్వమని.. ప్రేమే ఏసు మార్గమని ప్రబోధకులు ప్రవచిస్తున్నారు. మత పెద్దల ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయి. ఇప్పటికే క్రైస్తవ సోదరులు సెమీ క్రిస్మస్ వేడుకలు సంబరంగా జరుపుకున్నారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్

'లిఫ్టింగ్ హ్యాండ్స్' సేవలు ఎనలేనివి..

విజయనగరం టౌన్: చలిలో అవస్థలు పడుతున్న వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న లిఫ్టింగ్ హ్యాండ్స్ సేవా సంఘం సేవలు ఎనలేనివని సంఘ ఉపాధ్యక్షుడు డాక్టర్ సత్తి అచ్చిరెడ్డి, కోశాధికారి ఆలుగు వెంకటరావు అన్నారు. ఆదివారం వేకువజామున 3 గంటల ప్రాంతంలో మంచులో అవస్థలు పడుతున్న వృద్ధులు, దివ్యాంగులను గుర్తించి వారికి దుప్పట్లు కప్పి మానవతా దృక్పథం చాటుకున్నారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ.. మయూరి కూడలి, రైల్వేస్టేషన్, ఎన్‌సీఎస్ రోడ్డు, గంటస్తంభం, మూడులాంతర్లు, కోట, బాలాజీ కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్, తదితర ప్రాంతాల్లో చలితో ఇబ్బంది పడుతున్నవారికి దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి భోగరాజు సూర్యలక్ష్మి, అన్నదాన ట్రస్ట్ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి విష్ణుగాయత్రి, సభ్యులు కట్టా రమేష్, డిమ్స్ రాజు, సిరిపురపు గౌరీశంకర్, వేణు పూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో అర్చకులు ఆరవెల్లి రవిశర్మ నేతృత్వంలో అమ్మవారికి ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రతీ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరుకుమార్ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

భక్తి శ్రద్ధలతో గోదాదేవి పల్లకీ సేవ



పల్లకీసేవలో గోదాదేవి అమ్మవారు

జామి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పుష్పగిరి గ్రామ వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు ఫణిహరం మారుతాచార్యుల ఆధ్వర్యంలోఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గోదాదేవి అమ్మవారి పల్లకీ సేవను ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఆల యం వద్ద మధ్యాహ్నం అన్నదానం చేశారు.

హామీలు పరిష్కరించాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను పరిష్కరించకపోతే ఈ నెల 27 నుంచి సమ్మె చేయక తప్పదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్. రంగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక అమర్‌భవన్‌లో జరిగిన సమావేశంలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని.. అండర్ డ్రైనేజీ వర్కర్స్ మరణిస్తే 30 లక్షల రూపాయల పరిహారం ఇవ్వాలని, జీఓ 30ను సవరించి కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.కామేష్, దలాయి శ్రీను, తుపాకుల శ్రీను, కిషోర్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

తేమ శాతం 14 కంటే తక్కువ ఉండాలి

రాజాం:

రైతులు విక్రయానికి తీసుకొస్తున్న ధాన్యంలో తేమ శాతం 14 కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ కె.చంద్రరావు సూచించారు. మండలంలో కంచరాం, ఆగూరు, బొద్దాం, నందబలగ తదితర గ్రామాల్లో రైతులు నూర్పిడిచేసిన ధాన్యాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ధాన్యంలో తేమ శాతం, ఆరబెట్టడం, కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలపై రైతులకు అవగాహన కల్పించారు. ధాన్యాన్ని పొడి సంచుల్లో వేసి, కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని ఎక్కువ కాలం నిల్వ చేస్తే రంగు మారుతుందని, రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి విక్రయాలకు సంబంధించి ట్రక్కుసీటు పొంది, సంబంధిత కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు.

రేగిడి: ప్రభుత్వ నిబంధనల మేరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ అన్నారు. రైతులు నూర్పిడి చేసిన ధాన్యాన్ని తేమ శాతం పరిశీలించి కొనుగోలు చేస్తున్నామన్నారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో తేమ శాతం పరిశీలనకు యంత్రాలు వినియోగిస్తున్నామని, టెక్నికల్ అసిస్టెంట్లు రైతులు తీసుకువచ్చిన ధాన్యంలో తేమ శాతం ఎంత ఉందో లెక్కించి చెపుతారన్నారు.



రాజాం: బొద్దాంలో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ చంద్రరావు



రేగిడి: యంత్రాల వినియోగాన్ని పరిశీలిస్తున్న ఏఓ మురళీకృష్ణ

సీఎం సహాయ నిధి అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కంబాల జోగులు ఆదివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వంగర మండలం కొప్పర కొత్తవలస గ్రామానికి చెందిన అరసాడ ఆదిలక్ష్మి అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చేరగా, కుటుంబ సభ్యులు వైద్య ఖర్చుల కోసం అప్పు చేయాల్సి వచ్చింది. ఆర్థిక ఇబ్బందులను తెలియజేస్తూ ఎమ్మెల్యే సహకారంతో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా.. ప్రభుత్వం రూ.1.60 లక్షలు మంజూరు చేసింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును ఆదిలక్ష్మి భర్త పైడిరాజుకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో పార్టీ వంగర మండల అధ్యక్షుడు కరణం సుదర్శనరావు ఉన్నారు.

ఆపన్నులకు అండగా సీఎం సహాయ నిధి

• ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



రేణుక కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని గొలగాం గ్రామానికి చెందిన బూర్లె రేణుక అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆమెకు సీఎం సహాయనిధి నుంచి లక్షా 40 వేల రూపాయలు మంజూరయ్యాయి. దీంతో రేణుక కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే బడ్డుకొండ చెక్కును ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి, నిస్సహాయ స్థితిలో ఉన్నవారికి సీఎం సహాయనిధి ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆర్థికంగా ఆదుకుంటూ అండగా నిలుస్తున్నారని కొనియాడారు. డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ, నెల్లిమర్ల మండలాల్లో చాలా మందికి సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం చేశామని చెప్పారు. కార్యక్రమంలో గొలగాం సర్పంచ్ బూర్లె అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పెరియార్ రామస్వామి స్ఫూర్తితో పోరాడుదాం..

• సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్



పెరియార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: కుల, మత రహిత సమాజం కోసం.. అణగారిన వర్గాలు, మహిళల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన ద్రవిడ వీరుడు పెరియార్ రామస్వామి అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. పెరియార్ 50వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక అమర్ భవన్‌లో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పెరియార్ చిత్రపటానికి బుగత అశోక్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇప్పుడున్న కుల, మతతత్వ రాజకీయాలు, మూఢనమ్మకాలు, అనైతిక దాడులను ఎదుర్కొనేందుకు పెరియార్ ఆలోచనలే సరైనవన్నారు. పెరియార్ ఆలోచనలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు గౌరినాయుడు, పి.అప్పారావు, ఎ.జగన్నాథం, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఎ. సుమన్, భాను, దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

• మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్రీనివాస్

నెల్లిమర్ల: ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ అధికారి, నెల్లిమర్ల మండల ప్రత్యేకాధికారి వి. శ్రీనివాసరావు అన్నారు. మెగా హౌసింగ్ కంప్లీషన్ డ్రైవ్‌లో భాగంగా నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట జగనన్న కాలనీని ఆదివారం ఆయన సందర్శించారు. అనంతరం స్థానిక వార్డు సచివాలయంలో నాయకులు, లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను వెంటనే పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ వాసు, హౌసింగ్ ఏఈ పవన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మురళి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి



సమ్మెకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: ఈనెల 26 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ. జగన్ మోహనరావు, బి.రమణ పిలుపునిచ్చారు. స్టేడియం పేటలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఆ హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. డిమాండ్ల సాధనకు చేస్తున్న సమ్మెకు ప్రజలంతా సహకరించాలని కోరారు. సమావేశంలో కుమారి, రమా, ఈశ్వరమ్మ, రాధ, తదితరులు పాల్గొన్నారు.

వక్తృత్వం, చిత్రలేఖన పోటీలు

చీపురుపల్లి: జనవరి 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పట్టణానికి చెందిన ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షు డు రమణ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వం పోటీలను ఆదివారం నిర్వహించారు. స్థానిక సత్యరామ డిగ్రీ కళాశాల వేదికగా నిర్వహించిన ఈ పోటీల్లో 29 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు జనవరి 12న వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. ఆశయ రమణ మాట్లాడుతూ విద్యార్థులు తప్పని సరిగా స్వామి వివేకానంద జీవిత చరిత్ర తెలుసుకోవాలన్నారు. ఆశయ సంస్థ కార్యదర్శి మీసాల లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోండి

బొండపల్లి: కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చిన రైతులు రైతు భరోసా పెట్టుబడి సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ పి.వి.మల్లికార్జునరావు ఆదివారం ఓ ప్రకటనలో సూ చించారు. రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని, లేదంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

శృంగవరపుకోట: వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు జి.ఈరన్న అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో ప్రిన్సి పాల్ సీహెచ్.కేశవరావు అధ్యక్షతన కస్టమర్ క్లబ్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా అధ్యాపకులు ఈరన్న మాట్లాడుతూ కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకూ వినియోగదారులు ఖచ్చితంగా బిల్లులు తీసుకోవాలని చెప్పారు. అధ్యాపకులు వలీఖాన్, ఆర్.శ్రీలక్ష్మి, అప్పలరాజు, డి.హైమావతి, సురేష్, ప్రసాద్ పాల్గొన్నారు.